

నేడు బెళుగుప్పలో 'జగనన్నకు చెబుదాం'

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బెళుగుప్పలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం నాడు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెలుగుప్ప మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9-30 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బెలుగుప్ప మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.



నల్లచెరువులో అంగన్‌వాడీ కేంద్రం తాళాలలు బద్దలు కొట్టి తెరుస్తున్న సచివాలయ సిబ్బంది

- అంగన్‌వాడీల ఆందోళనలపై ఉక్కుపాదం
- తాళాలు పగులగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచే యత్నం
- అడ్డుకున్న అంగన్‌వాడీలు
- చలిలోనూ కొనసాగుతున్న దీక్ష

సమ్మెపై ఉక్కు సంకెళ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షపై ప్రభుత్వం ఉక్కు సంకెళ్లతో బంధించే ప్రయత్నం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను హెల్త్ సెక్రటరీల ద్వారా పగులగొట్టించి బలవంతంగా తెరిపించే ప్రయత్నాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేశారు. అనంతపురం నగరంలో బిందెలవారీ కాలనీలోనూ, నార్పల మండల కేంద్రంలోనూ, విడపనకల్లు మండలంలోనూ ఇటువంటి ప్రయత్నాలు చేశారు. వీటిని అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. సత్యసాయి జిల్లాలోనూ ఇటువంటి ప్రయత్నాలు జరిగాయి. నల్లచెరువు, మడకశిర మండలాల్లో తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేశారు. ఇక్కడ అన్ని చోట్ల అంగన్‌వాడీలు అడ్డుకుని మరో తాళాలు వేసి మూసివేశారు. అదే సందర్భంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట 36 గంటల దీక్షను అంగన్‌వాడీలు చేపట్టారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట బైటాయించి అక్కడే వంటా వార్పు చేసుకుని తిన్నారు. రాత్రికి చలిలోనూ నిద్రపోయారు. వీరికి ఆశా వర్కర్లు మద్దతు తెలిపారు. అంతకు మునుపు ఉదయం అనంతపురం మాజీ శాసనసభ్యులు వి.ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌లు పాల్గొని మద్దతు తెలిపారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లోనూ టిడిపి, సిపిఎం, సిపిఐ నాయకులు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించాలని సత్యసాయి కలెక్టర్ ఆదేశాలు



శింగనమలలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాలు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి వంద శాతం ప్రారంభించాలని సత్యసాయి జిల్లా కలెక్టరు అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. అధికారులతో సమీక్షలు నిర్వహించి ఐసిడిఎస్ పీడీ, ఐకెపి అధికారులకు ఈ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేయడం, అంతుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలివ్వడం పట్ల అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్

ఎన్నికలకు ముందు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ నాయకులతోపాటు, సిఐటియు రాష్ట్ర నాయకులు జీ.ఓబుళు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చేస్తామని ఎన్నికల ముందు హామీనిచ్చారని గుర్తు చేశారు. అదే విధంగా కొత్తగా తెచ్చిన యాప్ వలన అంగన్‌వాడీలకు సమస్య నెలకొందని చెప్పారు. రిటైర్డుబెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్లను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. అలా కాకుండా అణచివేసే ప్రయత్నం చేస్తే అంగన్‌వాడీ వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

3వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె వార్తలు 6లో

సమ్మెపై నిర్బంధాన్ని ఆపాలి : వి.రాంభూపాల్

మూడు రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెను జిల్లా అధికారులు క్రూరంగా అణిచివేసే చర్యలు, నిర్బంధాలు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పోలీసుల ద్వారా బెదిరింపులు, అధికారుల ద్వారా అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టే చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. అప్రజాస్వామిక చర్యలు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శిబిరాల వద్దకు పోలీసులు వెళ్లి నోటీసులు ఇస్తున్నారన్నారు. శుక్రవారం నుంచి సమ్మెలో పాల్గొనరాదని బెదిరించడం సరికాదన్నారు. ఐసిడిఎస్ మండల అధికారులు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను దౌర్జన్యంగా పగులగొట్టి వాలంటీర్ల ద్వారా సెంటర్లు నిర్వహించేందుకు ప్రయత్నించారని తెలిపారు. విడపనకల్లు యాడికి నార్పల తదితర మండలాల్లో పదుల సంఖ్యలో నేడు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టారని తెలిపారు. సమ్మెను పరిష్కరించాల్సిన ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడానికి సిద్ధపడటం అత్యంత అప్రజాస్వామికమని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అనేక రూపాల్లో నాలుగు నెలలుగా అంగన్‌వాడీ కార్మికులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే సమ్మె పరిస్థితిని సృష్టించి నేడు సమ్మెను అణిచివేయాలని ప్రయత్నించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రభుత్వం కార్మిక సంఘాల నాయకులతో చర్చలకు పిలిచి ఆర్థిక విషయాలు తప్ప ఇతర విషయాలు మాట్లాడదామని చెప్పడం మోసపూరితంగా ఉందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని కోరారు.

కదంతొక్కిన ఆశాలు

న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆశాలు కదంతొక్కారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 36 గంటల నిరసన దీక్షకు దిగారు.గురువారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరనసన ప్రారంభించి, వంటా వార్పు చేపట్టారు. రోడ్డుపైనే సహపక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు హాజరయ్యారు.వీరి ఆందోళనకు వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట వంటా వార్పుతో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆశా కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టిడిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ ఏజి.రాజమోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కనీస వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. గ్రామాల్లో బాలింతలు, గర్భిణీలు, చిన్న పిల్లలకు ఆశాలు సేవలు అందిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మికుల హక్కులు కాలరాసేలా ఉన్నాయని మండిపడ్డారు. ఆశాలతో జాబ్ చార్ట్ కంటే అదనంగా పని భారాలు మోపుతోందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందే అన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో రాబోయే టిడిపి ప్రభుత్వంలో ఆశాల న్యాయమైన సమస్యల పరిష్కారానికి అధినేత చంద్రబాబుతో పోరాడుతామని సూచించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఆశాలు వంటా వార్పు కోసం జిల్లా కేంద్రానికి వస్తుంటే పోలీసులతో ప్రభుత్వం అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడటం అన్యాయంగా ఉందన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలన్నారు. ఆశా కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ ఆశాలకు గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల న్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలను ఆశాలకు వర్తింపజేయాలన్నారు. కోవిడ్ కాలంలో మరణించిన ఆశాల కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, ఆ కుటుంబంలో ఒకరిని ఆశాగా తీసుకోవాలన్నారు. ఎఎన్‌ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. 36 గంటల దీక్షల్లో ఆశా కార్యకర్తలు గురువారం రాత్రి దీక్షా శిబిరం వద్దనే నిద్రించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు ముత్తుజా, వెంకటనారాయణ, రామాంజినేయులు పాల్గొన్నారు.

- 36 గంటల నిరసన దీక్షలు ప్రారంభం
- కలెక్టరేట్ ఎదుట వంటావార్పు
- మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

యువతకు సువర్ణావకాశం 'ఆడుదాం ఆంధ్ర'



'ఆడుదాం ఆంధ్ర' పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం యువతకు సువర్ణావకాశమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే 'ఆడుదాం ఆంధ్ర' పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు సిఎం జగన్ మంచి ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశారన్నారు. క్రీడాకారుల ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. సరైన అవకాశాలు లేక క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభ మరుగున పడిపోతోందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులను సమకూరుస్తున్నట్లు డిఎస్‌డిఒ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, కబడ్డీ కోచ్ అనిల్, షటిల్ కోచ్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసు సేవలకు పురస్కారాలు

ఎస్పీ చేతుల మీదుగా 49 మందికి ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

ప్రజల మాన,ధన, ప్రాణాలను రక్షించడంలో గత నెల ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందిని, గ్రామమహిళా పోలీసులను ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ అభినందిస్తూ గురువారం నాడు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రజలు పోగొట్టుకున్న సొత్తును రికవరీ చేసి దొంగలను అరెస్టు చేయడంతో పాటు జవాబుదారీగా సదరు సొమ్మును బాధిత ప్రజలకు అందజేయడం, సిసిటిఎన్ఎస్‌లో వివరాలను స్రక్రమంగా అమలు చేయడం, ఆత్మహత్యాయత్నాల నివారణ తదితర వాటికి సంబంధించి చొరవ చూపిన పోలీసులను సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా 49 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్ సురేష్ పని చేస్తూ ఈ ఏడాది అక్టోబర్ 25వ తేదీన అనారోగ్య కారణాలతో మరణించారు. 2009 బ్యాచ్‌నకు చెందిన ఈయన సహచర బ్యాచిమేట్స్ మానవతా థక్పథంతో సురేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని నిశ్చయించుకున్నారు. అందులో భాగంగా రూ.3.53 లక్షలను పోగుచేసి ఈ మొత్తాన్ని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతుల మీదుగా చెక్కు రూపంలో మతుడి భార్య సుజాతకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకష్ణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్ పాల్గొన్నారు.



పొగాకు ఉత్పత్తులు, అమ్మకాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ తయారు చేసిన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్పీ అన్బురాజన్ తదితరులు

పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై చర్యలు

ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం


బహిరంగ ప్రదేశంలో ధూమపానం, విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికై రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో గురువారం జిల్లాలోని పోలీసు అధికారులకి నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సమగ్ర శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులు పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రమాణం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధుల వల్ల ఏటా రాష్ట్రంలో 48 వేల మరణాలు సంభవిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఏ ఒక్క రూ పొగాకు వ్యసనపరులు కాకుండా రక్షించడం, వాళ్లని పొగాకు ఉత్పత్తులకు అలవాటు కాకుండా నిరోధించడం మన కర్తవ్యం అని తెలిపారు. మత్తు పదార్థాలు, మద్యం, పొగాకు, సైకోట్రోపిక్ ఉత్పత్తులని వైద్యుల సూచనల మేరకు తప్ప ఇతర సందర్భాల్లో పిల్లలకు ఇచ్చినా, ఇవ్వడానికి కారణమైన వారికి ఏడేళ్ల వరకూ కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తారన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో 'నో స్మోకింగ్' బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎఎస్పీ శివరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రం లోని వైద్యులందరూ చేస్తున్న సమిష్టి కృషితో పాటు పోలీసులు అమలు చేసే నివారణ చర్యలు ఎక్కువ మంది ప్రాణాలను రక్షించగలవన్నారు. సమావేశంలో అన్ని పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులు, రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్యశాఖ అధికారులు, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి, సోషల్ వర్కర్ శ్రీరాములు, కిషోర్, ప్రేమ్‌బాబు, ఆంజనేయులు, వేణుగోపాల్, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే పగటివేషాలు

టిడిపి, జనసేనపై ఎమ్మెల్యే అనంత ఆగ్రహం

ప్రజాశక్తి -అనంతపురం

ఎన్నికలు వస్తున్నాయని తెలిసే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పగటి వేషగాళ్ల మాదిరిగా జనం వద్దకు వస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం సాయంత్రం రంగస్వామి నగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాలతో పాటు స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బోర్డు, వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు పేదల సంక్షేమం కోసం చేసింది ఏమీ లేదన్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ సీఎం జగన్‌పై కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక పోలవరంను నిర్వీర్యం చేసి, పట్టిసీమ పేరుతో డ్రామాలు ఆడారన్నారు. రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేసిన ఘనత ముఖ్యంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. అలాంటి వాలంటీర్లను దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నాలను ప్రతిపక్షాలు చేయడం దుర్మార్గమన్నారు. అనంతపురం నగరంలో సీఎం జగన్ ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్ల రూ.800 కోట్లతో అభివద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజలు గతంలో చంద్రబాబు పాలనకు.. ఇప్పుడు జగన్ పాలనకు మధ్య తేడాను గమనించి మరోసారి వైసీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ వీరా రామకృష్ణారెడ్డి, పార్టీ క్లస్టర్ కన్వీనర్ రమణారెడ్డి, నగర అధ్యక్షుడు చింత సోమశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి రాధాకష్ణ, కార్పొరేటర్లు దుర్గాదేవి, శ్రీనివాసులు, టివి చంద్రమోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు రామచంద్ర, పాన్ సాధిక్, పెట్రోల్ వెంకటరాముడు, పుల్లన్న, నాగరాజు, లక్ష్మీనారాయణ, అబూబకర్ పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలను నివారించాలి : డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-అనంతపురం

మాతా, శిశు మరణాలను నివారించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఇబి.దేవి ఆదేశించారు. జిల్లాలో గత నెలలో చోటుచేసుకున్న మాతా, శిశు మరణాలకు గల కారణాలపై సంబంధిత ఆ ప్రాంత డాక్టర్లు, సిబ్బందితో గురువారం డిఎంహెచ్ఓ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవి మాట్లాడుతూ అలాంటి మరణాలకు కారణాలు తెలుసుకొని మరోసారి జరగకుం డా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు అన్నిరకాల వైద్య పరీక్షలు, సేవలు అందించి సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు కనీసం 10 డెలివరీలు చేయాలన్నారు. మదర్ అండ్ చైల్డ్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ ప్రతి వంద మందిలో 10 నుంచి 15 మంది హైరిస్క్ గర్భిణులు ఉంటారని అట్టి వారిని గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డా. పాల్‌రవికుమార్, ప్రభుత్వాసుపత్రి చిన్న పిల్లల వైద్యులు డా. శంకరనారాయణ, మత్తుమందు వైద్యులు డాక్టర్. నవీన్‌కుమార్, స్త్రీ వైద్య నిపుణులు డా. పార్వతి, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, ఎంపిహెచ్ఎస్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతో కెసి.హరి భేటీ



చంద్రబాబుతో మాట్లాడుతున్న కెసి.హరి

ప్రజాశక్తి-గుంతకల్లు

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతో కెసి.నారాయణ కుమారుడు కెసి.హరి కుమార్ గురువారం నాడు టిడిపి జాతీయ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు హరికుమార్‌తో కుటుంబ యోగక్షేమాలు అడుగుతూ, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు గుంతకల్లు అసెంబ్లీ అభ్యర్థులుగా పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు కషి చేశానని చంద్రబాబుకు తెలిపారు. భవిష్యత్తులోనూ పార్టీ ఆదేశానుసారం నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని చంద్రబాబుకు తెలిపారు.

మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌కు ఎమ్మెల్యే అభినందనలు

అనంతపురం : ఇటీవల యలమంచిలిలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్ పోటీల్లో నగరంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన శివతేజ చారుగుండ్ల తృతీయ స్థానంలో నిలిచాడు. దీంతో గురువారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శివతేజను అభినందించారు. మున్ముందు జరిగే పోటీలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.



శివతేజను అభినందిస్తున్న ఎమ్మెల్యే

హామీలు అమలు చేయమంటే బెదిరింపులా..?

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం దుర్మార్గం

మొండి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

3వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

'ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నాం. తమ డిమాండ్లు న్యాయమైనవి. చాలా సార్లు విజ్ఞాపనలు ఇచ్చి పరిష్కరించకపోవడంతో విసిగివేసారి సమ్మెలోకి దిగాం. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలపై చర్చలు జరిపి పరిష్కరించాల్సింది పోయి ప్రభుత్వం అధికారుల చేత బెదిరింపులకు పాల్పడడం సరికాదు. బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలను పగలగొట్టాలని చూడడం దుర్మార్గమైన చర్య. ఇలాంటి మొండి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'... అని అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 3వ రోజుకు చేరుకుంది. అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసన దీక్షలు కొనసాగాయి. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడాన్ని అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు ఖండించారు.


బుక్కరాయసముద్రం : దీక్షా శిబిరంలో కూర్చున్న అంగన్వాడీలు


ఆత్మకూరు : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన


గుత్తి : మోకాళ్లపై నిల్చొని నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


నార్పల : అంగన్వాడీసెంటర్ తాళం పగులగొడుతున్న అధికారులు

సమ్మె కొనసాగిస్తాం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా బెదరకుండా అంగన్‌వాడీల సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ స్పష్టం చేశారు. వేతన పెంపు, గ్రాట్యూటీ, బకాయి సెంటర్ల అద్దెలు, టీఏ, డీఏలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్‌ల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం 3వ రోజు కొనసాగింది. అనంతపురం కలెక్టరేట్ వద్ద జరుగుతున్న సమ్మె దీక్షల కార్యక్రమంలో పెద్ద ఎత్తున అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తదితరులు హాజరై మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అక్కా చెల్లెమ్మలు కష్టాలు తీరుస్తామంటూ గొప్పలు చెప్పే సిఎం జగన్‌కి అంగన్‌వాడీలు రోడ్లపై చేస్తున్న ఆందోళనలు కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరసనలు తెలిపే హక్కును కూడా వైసిపి ప్రభుత్వం హరిస్తోందన్నారు. ధర్నాలు చేయనికుండా పోలీసులతో అడ్డుకునే సంస్కృతి తీసుకురావడం విచాకరం అన్నారు. మరో మూడు నెలల్లో టిడిపి ప్రభుత్వం రాబోతోందని, తప్పకుండా అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీలకు టిడిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, మాజీ కార్పొరేటర్ సరళ, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం, జిల్లా అధ్యక్షులు లక్ష్మి నరసింహులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య మద్దతు తెలిపారు. సిఐటియు నగర కార్యదర్శులు వెంకట నారాయణ, ముత్తుజా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల తదితరులు హాజరై మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, నగర నాయకులు నక్షత్ర, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

పీడీపై ఆగ్రహం

సమ్మె చేస్తున్న ప్రాంతానికి ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి వచ్చి సమ్మె విరమించాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని, శుక్రవారం నుంచి అంగన్‌వాడీలందరూ విధుల్లో చేరాలన్నారు. సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పీడీ మాటలపై కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె చేస్తుంటే తాళాలు పగులగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలు ఎలా తెరుస్తారని మండిపడ్డారు. దీంతో పీడీ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

సమ్మెను అణిచివేస్తే ప్రభుత్వ పతనమే

సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులు

ఉరవకొండ : అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మెను అణిచివేయాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పతనం తప్పదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. అంగన్వాడీ వర్కర్స్,హెల్పర్స్ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు తహశీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె 3వ రోజైన గురువారం కొనసాగింది. ఉరవకొండలో ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మోకాళ్లపై నిరసన చేపట్టగా, విడపనకల్లులో తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. వీరికి ఓబులు, రమాదేవి సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లను భయాందోళనకు గురి చేసేలా అధికారులు సెంటర్ల తాళాలను పగలగొట్టి నిరంకుశంగా పాలన సాగిస్తే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని వీడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిచో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు శీనప్ప, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, కార్యవర్గ సభ్యులు శశికళ, రామాంజనమ్మ, లక్ష్మీదేవి, స్వర్ణలత, వరలక్ష్మి, శ్వేతనాగు, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టిన అధికారులు

రాయదుర్గం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మె చేస్తుండగా సిడిపిఒ ప్రభావతి, ఎస్ఐ ప్రసాద్ శిబిరం వద్దకు చేరుకుని అంగన్వాడీ కేంద్రాల భవనాల తాళాలు ఇవ్వాలని కోరారు. అందుకు వారు ససేమిరా అనడంతో సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల సాయం తో భవనాల తలుపు తాళాలను పగులగొట్టి అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారు. రాయదుర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 125 కేంద్రాలు ఉండగా 27 చోట్ల బలవంతంగా కేంద్రాలను తెరిచి పిల్లలకు మధ్యాహ్న భోజనం అందజేసినట్లు సిడిపిఒ తెలిపారు. డి.హీరేహాల్ మండలంలో 15కి పైగా, రాయదుర్గం పట్టణంలో 2, మండలంలో 3, గుమ్మఘట్టతో పాటు మండలంలో పలుచోట్ల అంగన్వాడీ కేంద్రాలను తెరిచి స్టాకును నమోదు చేసి స్వాధీనం చేసుకున్నారు.

కక్ష సాధింపు దుర్మార్గం : కాలవ

రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోగా అధికా రులు వారిపై బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడటం దుర్మార్గం అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. దీక్ష చేపట్టిన అంగన్వాడీలను కాలవ పరామర్శించి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే అంగన్వాడీలకు న్యాయం చేస్తామని తెలిపారు. కాగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి శిబిరాన్ని సందర్శించి మద్దతు, సంఘీభావం తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో ముదిగల్లు జ్యోతి, జమీల్‌ఖాన్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, సిపిఎం, సిఐటియు నాయకులు మల్లికార్జున, నాగరాజు, చేనేత కార్మిక సంఘం నాయకులు మధు, తదితరులు ఉన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె కొనసాగింది. వీరి దీక్షా శిబిరానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో విశేష సేవలందిస్తున్న అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను సిఎం జగన్ తక్షణమే నెరవేర్చాలని కోరారు. అలాగే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరి దీక్షకు సిఐటియు ఆశా వర్కర్లు, ఉపాధి హామీ, తాగునీరు, తదితర సంఘాలు సంఘీభావం తెలిపాయి.


పెద్దవడుగూరు : తల్లితో కలిసి జెండా చేతబూని దీక్షలో పాల్గొన్న చిన్నారి

డి.హీరేహాల్ : అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అండన్వాడీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజు కొనసాగింది. దీక్షా శిబిరంలో అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షలో మండల సిఐటియు నాయకులు లోకేష్ పాల్గొని మద్దతు తెలిపారు.

బ్రహ్మసముద్రం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగనవాడీలు చేపట్టిన దీక్షలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ పాల్గొని మద్దతు తెలిపి బిస్కెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. అంగన్వాడీ టీచర్లపై అధికారులు ఒత్తిడి తెచ్చి కేంద్రాలను తెరవాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కురుగోడ నాగరాజు, ఓబులేసు, పరమేష్, హనుమంతరాయుడు, మల్లి, గురు సిద్ధ, రమ్య, వరలక్ష్మి, సుజాత, అనిత, వర్కర్లు సుజాత, సంతోషమ్మ, త్రివేణి, ఎర్రమ్మ, సత్యమ్మ పాల్గొన్నారు.

పుట్లూరు : పుట్లూరులో అంగన్వాడీల సమ్మె మూడో రోజూ కొనసాగింది. జిల్లా అధ్యక్షుడు ఎస్. సూరి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకూ వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ లీడర్స్ జయలలిత, రమాదేవి, శశికళ, లక్ష్మీ, మండల కమిటీ నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, భూషణ పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దీక్షా శిబిరంలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ వర్కర్లు కూర్చున్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్ప ర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు హనుమంతు, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు రాజేశ్వరి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు జయమ్మ, సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు

బుక్కరాయసముద్రం : అంగన్వాడీల సమస్యలపై చేపట్టిన సమ్మెకు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వారిలో శింగనమల ప్రాజెక్టు కార్యదర్శి కాత్యాయని, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, వ్య.కా.సం మండల నాయకులు లింగమ య్య, పుల్లయ్య, సిఐటియు మండల సహాయ కార్యదర్శి నెట్టికంటయ్య ఉన్నారు. శిబిరంలో మండల అంగన్వాడీ సెక్టార్ లీడర్స్ విమల, సుజాత, వెంకటలక్ష్మి, రత్నమ్మ, లక్ష్మీదేవి, లలిత, గీత, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ పాల్గొన్నారు.

పామిడి : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, ఎఐటియుసి లీడర్ కె.జ్యోతి మద్దతు పలికారు. దీక్షా శిబిరంలో అంగన్వాడీ వర్కర్స్ జయంతి, జెఎల్.రామాంజనమ్మ, మహాలక్ష్మి, రామాంజనమ్మ, రమాదేవి, సేకున్ బి, ప్రేమకుమారి, హెల్పర్స్ పాల్గొన్నారు.

నార్పల : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. వారి దీక్షా శిబిరాన్ని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. పిల్లల సమగ్ర అభివృద్ధి పథకం(ఐసిడిఎస్) ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కుళ్లాయప్ప, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అయితే స్థానిక అంగన్వాడీ కేంద్రం తాళాలను పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు పగలగొట్టి తలుపులు తెరిచారు.

శింగనమల : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు జోలి పట్టి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నడిరోడ్డుపై దుకాణాల వద్ద భిక్షాటన చేపట్టారు. అయితే తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ నిర్మల కుమారి, ప్రభుత్వ అధికారులు మీరు అంగన్వాడీ కేంద్రాలను తెరవకపోతే తాళాలు పగలకొట్టి తలుపు లు తెరిచి కేంద్రం నడుపుతామని అంగన్వాడీ సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో హరిప్రియ, నాగేశ్వరమ్మ, లక్ష్మీదేవి, ఓబుళమ్మ, సరస్వతి, కాంతమ్మ, రామలక్ష్మి, రామాంజనమ్మ, ప్రశాంతి, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి, సాయిచౌడమ్మ, రమాదేవి, రాజేశ్వరి, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : అంగన్వాడీల సమ్మెకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, పోలీసులు అంగన్వాడీ సిబ్బందిపై బెదిరింపులకు పాల్ప డడం తగదన్నారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టించడం హేయమైన చర్య అని మండి పడ్డారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ, నాయకులు మెహ్రూన్, రాధిక, రుద్రమ్మ, మల్లక్క, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే నిరవధిక దీక్షలను ఉధృతం చేస్తామని ఎపి అంగన్వాడీ సంఘం నాయకురాలు నాగరాణి, భాగ్యలక్ష్మీ హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన నిరవధిక సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఓ కార్యకర్త కుమార్తె జెండా పట్టుకుని నిరసన తెలపడం పలువురిని ఆకర్షించింది.

గుత్తి : అంగన్వాడీల సమస్యలపై ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యం లో చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరుకుంది. వారికి సిపిఎం, టిడిపి, జనసేన, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు. అంగన్వాడీలు సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మోకాళ్లపై నిల్చొని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, టిడిపి నాయకులు వెంకట శివుడుయాదవ్, జనసేన నాయకులు మణికంఠ, యుటిఎఫ్ నాయకులు రాఘవేంద్ర, లింగమయ్య, సిఐటియు నాయకులు సూరి, మహేష్, కృష్ణ, పాండు, స్థానిక నాయకులు బి.రామకృష్ణ, వి.నిర్మల, ఎం.మల్లేష్, సి.రమేష్, యు.మల్లికార్జున, ఎన్.రేణుక, కళ్యాణి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : అంగన్వాడీ వర్కర్ల సమ్మెను అణచివేస్తే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు హెచ్చరించారు. అంగన్వాడీల దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి చెన్నారెడ్డి, ఓబులేసు, ఓబన్న, ప్రమీలమ్మ, అరుణ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టగా ఎంఆర్సీ కాంట్రాక్ట్ ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తీర్చాలన్నారు. తాము కూడా ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని, మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్సీ కాంట్రాక్ట్ ఉద్యోగులు శంకర్‌నారాయణ, చిరంజీవి, ఎర్రిస్వామి, కృష్ణవేణి, రాముడు, కార్యదర్శి సత్యవతి, సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, రాధ, తిలోత్తమ, మారుతమ్మ, అలివేలమ్మ, ఈశ్వరమ్మ , కరిబసమ్మ, చంద్రకళ, 62 సెంటర్ల టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


ఉరవకొండ : దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జి.ఓబులు


విడపనకల్లు : దీక్షా శిబిరం వద్ద వంటా వార్పు


పుట్లూరు : గ్లాసులతో ప్లేట్లను మోగిస్తూ నిరసన


పామిడి : మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


రాయదుర్గం : దీక్షకు మద్దతు తెలుపుతున్న కాలవ శ్రీనివాసులు


గార్లదిన్నె : శిబిరంలో మాట్లాడుతున్న తరిమెల నాగరాజు


బ్రహ్మసముద్రం : అంగన్‌వాడీలకు బిస్కెట్లు అందిస్తున్న నాయకులు

15న కర్నూలులో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈ నెల 15వ తేదీ కర్నూలు నగరంలో నిర్వహించనున్న ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశా లను జయప్రదం చేయాలని వేదిక సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణం లో సమావేశాల పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 15వ తేదీ కర్నూలు నగరంలో రైతుల మహా ప్రదర్శన, పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ లో బహిరంగ సభ ఉంటాయన్నారు. జాతీ య, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రైతులకు సంబంధించిన నల్ల చట్టాల రద్దు, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల రద్దు, రైతులు, పండ్ల తోటలు నష్టపోయిన వారికి పరిహారం, తదితర డిమాండ్లపై చర్చిస్తామన్నారు. రైతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు శీనప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎఐకెఎస్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సచివాలయ నిర్మాణ పనుల తనిఖీ

బెళుగుప్ప : మండల పరిధిలోని బెళుగుప్ప, శిర్పి, ఎర్రగుడి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లను గురువారం ఉరవకొండ డిఇ అరుణ్‌కుమార్ తనిఖీ చేశారు. డిఇ కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ ఈ నెలాఖరు లోగా భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అనంతరం పశువైద్యశాలను సందర్శించారు. సచివాలయం, ఆర్‌బికెలను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాల ని మండల ఎఇ సుధాకర్, గ్రామ సచివాలయ ఇంజినీర్లు గోవర్ధన్, చంద్రకాంత్, రాజశేఖర్, నాగార్జున, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్నలకు సూచనలు చేశారు. వారి వెంట అధికారులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.


ఎఐకెఎస్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ఉరవకొండ : పట్టణంలోని 10వ వార్డు బళ్లారి రోడ్డులో నివాసం ఉంటున్న కొప్పరం సత్యనారాయణ భార్య అన్నపూర్ణ(44) ఈ నెల 7వ తేదీ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గురువారం వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలను ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగతా రూ. 90 వేల ను వారి ఖాతాలో జమ చేస్తామని సర్పంచి లలిత, వార్డు సభ్యుడు నిరంజన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ విభాగం వైసిపి అధ్యక్షుడు బసవరాజు, చందా చంద్రమ్మ, ఎంపిటిసి వన్నూర్‌సాబ్, మైనారిటీ నాయకుడు మద్దికెర అన్వర్‌బాషా, సచివాలయం-3 వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి, వలంటీర్లు చిరంజీవి, ఇర్ఫాన్, ఆనంద్, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగిన జిడిఎస్ ఉద్యోగుల సమ్మె

పామిడి : గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజైన గురువారం కూడా కొన సాగింది. నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్(జిడిఎస్) యూనియన్ ఎపి అసిస్టెంట్ సర్కిల్ సెక్రటరీ నాగేంద్రబాబు మాట్లాడుతూ నిరవధిక సమ్మెలో గ్రామీణ తపాలా ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతంగా మందుకు తీసుకెళ్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి, ఆనంద్, సోమశేఖర్‌రెడ్డి, మౌనిక,తదితరులు పాల్గొన్నారు.

నూతన డిటిగా లక్ష్మీనరసింహులు

నార్పల : మండల నూతన డిప్యూటీ తహశీల్దాం (డిటి)గా లక్ష్మీనరసింహులు గురువారం బాధ్యత లు చేపట్టినట్లు తహశీల్దార్ హరికుమార్ తెలిపారు. ఇక్కడి పనిచేస్తున్న సురేష్ డిప్యుటేషన్‌పై కలెక్టరేట్‌కి వెళ్లడంతో ఆయన స్థానంలో రాప్తాడు నుంచి లక్ష్మీనరసింహులు ఇక్కడి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సురేష్ నుంచి మండల వివరాలు, తదితర అంశాల గురించి తెలుసుకొని, పలు రిజిస్టర్లు, రికార్డులను ఆయన నుంచి స్వాధీనం చేసుకున్నారు.




17న పెన్షనర్ల దినోత్సవం

రాయదుర్గం : ఈ నెల 17వ తేదీ ఉదయం 10:30 గంటలకు స్థానిక పెన్షనర్ల భవన్‌లో జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎపి ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఇ.రామాంజ నేయులు ఓ ప్రకటనలో తెలిపారు.

వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మారుతి

అనంతపురం : వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గొర్ల మారుతిని రాష్ట్ర పార్టీ నియమించింది. మారుతి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా వైఎస్ఆర్ అడుగు జాడల్లో నడుస్తూ వైసిపి అభ్యున్నతికి కృషి చేసిన తనను గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా భావించి పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.


సిఎం జగన్‌తో మారుతి

వైఎస్ఆర్ఎస్‌యు రాష్ట్ర అధికార ప్రతినిధిగా కేశవరెడ్డి

తాడిపత్రి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం (వైఎస్ఆర్ఎస్‌యు)లో చురుగ్గా పనిచేసిన గంగుల కుంట కేశవరెడ్డిని ఆ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కేశవరెడ్డి మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన సిఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి బలోపేతం, గత ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేసినట్లు తెలిపారు. వైఎస్ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు పానుగంటి చైతన్య, మద్దిరెడ్డి నరేందర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


గంగులకుంట కేశవరెడ్డి

గ్రంథాలయం తనిఖీ

గుత్తి : పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని గురువారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమ సందర్శించి రికార్డులు, పుస్తకాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ పన్నులను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. పాఠకులు గ్రంథాలయాన్ని తరచూ సందర్శించేలా పని చేయాల న్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు, సిబ్బంది సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల ఎస్ఐకు ఎస్పీ ప్రశంసాపత్రం

నార్పల : ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి గురువారం జిల్లా ఎస్పీ అన్బురాజన్ నుంచి ప్రశంసాపత్రం అందు కున్నారు. ఇటీవల కాలంలో మండలంలో జరిగిన మహిళల మిస్సింగ్ కేసులను ఎస్ఐ ఛాలెంజింగ్‌గా తీసుకొని సిబ్బంది సహకారంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సంఘటనలు జరిగిన 24 గంటల్లోపే వారి ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. కేసేపల్లి గ్రామంలో జరిగిన పట్టు చీరల చోరీని 24 గంటల్లోపే రికవరీ చేశారు. డ్రిప్పు దొంగలను కూడా పట్టుకొని చోరీకి గురైన డ్రిప్పును రికవరీ చేసి రైతులకు అందజేశారు. దీంతో ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి పనితీరును ప్రశంసిస్తూ గురువారం జిల్లా ఎస్పీ అన్బురాజన్ ప్రశంసాపత్రం అందజేశారు. ఎస్ఐకి పోలీస్ సిబ్బందితో పాటు పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ

కుళ్లాయిస్వామి సన్నిధిలో వైసిపి నేత రాజగోపాల్

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, కుళ్లాయిస్వామి లను గురువారం వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు అర్చకులు ప్రత్యేక ఆశీర్వాచనలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట వై.ప్రదీప్‌కుమార్, రాజా, రఫీ, గురుస్వామి ఉన్నారు.

చలోకలెక్టరేట్‌కు ఫీల్డ్ అసిస్టెంట్ల పిలుపు

బొమ్మనహాల్ : సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చినట్లు ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఎంపిడిఒ షకీలాబేగంకు అర్జీ ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ మండల అసోసియేషన్ అధ్యక్షుడు ఉలిగప్ప మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26వేలు, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్, ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఎఫ్‌టిఎస్, పని భారం తగ్గింపు, తదితర 8 డిమాండ్లపై అర్జీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మండల పరిధిలోని 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎపి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర సెక్రటరీగా శేఖర్

ఉరవకొండ : ఎపి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర సెక్రటరీగా కోలేగుండ్ల శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు రాష్ట్ర కమిటీ పేర్కొంది. శేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ఛైర్మన్ పాలపర్తి శ్రీనివాస్ చక్రవర్తి, రాష్ట్ర ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పివి గాయత్రీదేవితో ఎన్నికకు సహకరించిన ప్రభాకర్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎరుకుల జాతి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంఛన లేకుండా కృషి చేస్తానన్నారు. అభివృద్ధి చెందాలంటే కలిసి కట్టుగా ఉండి ముందుకు సాగాలన్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే మన జాతికి న్యాయం చేసిన వారమవుతామన్నారు.